
# త్రిభంగి

లక్ష్మీనారాయణ



వర్షం... వర్షం...!

సిటీలో ఎప్పుడు, ఎక్కడ, ఎందుకు వర్షం పడుతుందో ఆ వాతావరణం గురించే చెప్పేవాళ్లకు కూడా తెలీదనుకుంటా. చీదరగా.. వర్షం.

చికాకుగా వర్షం...

"ఇంకెంత, ముప్పై గంటలు!" స్వగతించాలనుకుంటూ పైకే అనేశాను నేను.

"అవును మరీ... ఈ" అని దీర్ఘం తీస్తూ, సరిగ్గా ఇరవై తొమ్మిది గంటల యాభై ఆరు నిముషాల పదహారు సెకెండ్లుంది కుడిచేతి మణికట్టు మీది రాడో వాచీ.

"చందూ! ఫోనోయ్!" అన్నాడు సుందరం.

"ఆ(..." అంటూ, ఆలోచనల్లోంచి లేచి వెళ్లి ఫోన్ తీసుకుని "హలో!" అన్నాను, అలవాటుగా- ఇంత చీదర వర్షంలో ఫోనెవరు చేశారనుకుంటూ.

"నువ్వా? వచ్చావా వసంతా?" మెల్లగా మార్దవంగా

అన్నాననుకున్నా.

సుందరం తలెత్తి చూశాడు-రాసుకుంటున్న వాడల్లా నాకేసి పరిశీలనగా చూస్తూ.

అది గమనించిన నేను "సర్లె సర్లే... సాయంత్రం నేను వచ్చిన తర్వాత మాట్లాడుకుందాం" అంటూ ఫోన్ పెట్టేశాను.

ఇంకెంత? సరిగ్గా ఇరవై తొమ్మిది గంటల పద్దెనిమిది నిముషాలు-అనుకున్నాను-ఈ సారి రాడోకు తనను సరిదిద్దే అవకాశం యివ్వకూడదనుకుంటూ.

000

అంతే! అప్పుడు కూడా యిలాగే ముసురు... చీదర... వర్షం. బురద... ఆ జ్ఞాపకాల పరిమళం జలజలా రాలిపడే జాజుల్లా తలపుల్లో మెదలగానే అప్రయత్నంగా పెదవులపై సన్నటి దరహాసరేఖ మెరిసింది-తదియనాటి చంద్రునిలా.

"ఏమిటి చందూ, నీలో నువ్వే నవ్వుకుంటున్నావ్?" ఆత్మీయంగా అడిగాడు సుందరం.

"మీ వదిన వచ్చిందోయ్ యీ వుదయం!" గుంభనంగా నవ్వుతూ సీటు దగ్గరికి వచ్చేశాను.

000000

ఆ రోజు కూడా యిలాగే వర్షం...

పైగా అలవాటు లేని దారేమో. ఏది రోడ్డో, యేది బురద గుంటో తెలీటం లేదు. అసలా వర్షంలో పడి నేను వస్తానని ఎవరూ అనుకునుండరు. అందుకే రోడ్డు మీద ఎవరూ లేరు యెదురుచూస్తూ -అనిపించింది. ఆ సాయంత్రం ఆ వూళ్లో బస్సు దిగి, ఆ రోడ్డు మీంచి నాలుగైదు కిలోమీటర్లు నడక తప్పదు. సాధారణంగా అయితే, అక్కడ రోడ్డు పక్కనున్న కిళ్లీ షాపు దగ్గర యేవో రిక్షాలుంటాయి. కాని యిప్పుడు యీ అకాలవర్షం వల్ల వాళ్లెవరూ లేరు.

ఇక నడక తప్పదనుకుంటూ ప్యాంటు పైకి మడత పెట్టి, బూట్లు చేత బట్టి, ఆ బురదలో చిత్రవిచిత్రవిన్యాసాలు చేయుటం ప్రారంభించాను. ఇద్దరు ముగ్గురు దారిలో యెదురువస్తూ నాకేసి పరీక్షగా చూసి, చిన్నగా నవ్వుకుంటూ వెళ్లిపోయారు... నన్ను దాటుకుని. ఆ వర్షంలో... ఆ బురద నీళ్లలోనే పడి తపతపమంటూ అడుగులు విసురుగా వేస్తూ.

వాళ్ల కళ్లల్లో ముందు ఆశ్చర్యం, ఆ తర్వాత మాత్రమే పలకరింపులూ, కుశలప్రశ్నలూను... నన్ను చూడగానే.

ఈ లోపులో రెండంటే రెండు కళ్లు మాత్రమే నా రాక లోని 'ఆంతర్యం' గ్రహించి కొంటెగా నవ్వాయి... తలుపు చాటు నుంచి చూస్తూ.

అంటే మిగతావాళ్లకు తెలీదని కాదు కానీ, నా రాక వాళ్లు ఊహించనిది కాదు కదా అనిపించింది వాళ్ల ధోరణి చూశాక.

000

"ఏం చందూ! లంచ్‌కు రావా? అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్. ఏమిటీ పొద్దున్నుంచీ? "




సుందరం ఆప్యాయంగా అడిగాడు.

"ఈ రోజు యీ వర్షం తగ్గదా సుందరం?" అన్నాను చిరాగ్గా మొహం పెట్టి.

చిన్నగా నవ్వుతూ, "చూడు చందూ, మనస్సును ప్రశాంతంగా వుంచుకో. మిగతా విషయాలేమీ పట్టించుకోకు. అన్నట్టు రేపు మన సి.ఎం.డీ. కూడా వస్తున్నాడు తెలుసా?" అన్నాడు సుందరం.

వర్షం యింకా పడుతూనేవుంది. దూరంగా నాలా ఏదో పొంగి ప్రవహిస్తున్న శబ్దం వినబడుతూంది.

"అవును, కానీ ప్రత్యేకంగా మాత్రం కాదు" అని, "నీకు తెలుసా రేపు యిక్కడ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సెమినార్ వుంది కదా! పన్లో పనిగా యిక్కడికి కూడా వస్తున్నాడు" అన్నాను నిరాశగా చూస్తూ.

"అంత తేలిగ్గా తీసేయకు పెద్దవాళ్ల మూవ్‌మెంట్స్‌ను! ఏమో! మన బాస్ పెద్ద ఎత్తులోనే వున్నట్టున్నాడు గదా!" అన్నాడు సుందరం టిఫిన్ బాక్స్ మూసేస్తూ.

"అయుండచ్చు" అక్కణ్నుంచి లేస్తూ అనాసక్తంగా అన్నాను.

000

వర్షం యింకా తగ్గలేదు. బోదెల్లోంచి నీళ్లు పల్లంలోకి వడిగా ప్రవహిస్తున్నాయి. దూరంగా పాకల్లోని పశువులు కదిలినపుడల్లా వినిపించే దోమల రొద, పేడ వాసనలతో వాతావరణం ముక్కుపుటాలను అదరగొడుతూంది. చిదరచిదరగా వర్షం.

ఆ రెండు కళ్ల కోసం మాత్రం నేను నా తనువంతా కళ్లు చేసుకున్నాను. పైగా సంగతులు చెప్పుకుంటూ చుట్ట పొగ గుప్పుగుప్పుమంటోంది....

తనూ, తన కోర్టు వ్యవహారాలూ... లావాదేవీలూ, మతలబులూ వంటి సంగతులు ఆ గుడ్డి వెలుతురులో ఏకరువు పెడుతున్నాడు. నే యెదురు చూసే ప్రియతమ నేత్రాల కన్నతండ్రి.

కిటికీ లోంచి కనిపించే జాజుల పందిరి వర్షానికి తడుస్తూ... పక్కనే వున్న మల్లె తీగతో కలిసి గాలికి యుగళగీతం ఆలపిస్తున్నట్లుగా తలూపుతూంది నాకేసి కొంటెగా...

వాటి నాట్యసౌరభాలను ఆస్వాదిస్తూ... కూనిరాగమేదో పల్లవిస్తూ... ఎదురుచూస్తూ... కూర్చున్నాననుకున్నాను.

అయిదున్నర సూచికగా గోడ గడియారం గంట కొట్టేసరికి మెలకువ తెచ్చుకుని దిగ్గున లేచి కూర్చుని "ఛ!" అనుకొన్నాను. కర్పూరంలా కరిగిన కాలాన్నీ, నా మొద్దు నిద్రనూ తలచుకుని.

000

ఆమె... వసంత కూర్చున్న తీరుకు మనసులోనే ముచ్చట పడుతూ. ఆమె యిస్తున్న తాంబూలం నములుతూ గోడ మీది కేలండర్‌లోని ఆ అజంతాశిల్పాన్ని చూస్తున్న నాలో ఏదో స్పందన!

అలవోకగానే "నువు కూడా అలా ఆ గోడ మీద వేలాడే కేలండర్‌లోని శిల్పంలా వుండేదానివి. ఇప్పుడు కూడా కొంచెం ప్రయత్నపూర్వకంగానే అయినా, అలా వుండగలుగుతున్నావు కదా!" దగ్గరకు తీసుకుని భుజం మీద అరచేత్తో నిమురుతూ పైకే అనేశాను.

"ఛీ!" కొంటెగా నాకేసి చూసి నవ్వుతూ అంది వసంత.

"అప్పుడు కూడా యిలాగే వర్షం కదా!" అన్నాను ఉడికిస్తూ. ఏవో జ్ఞాపకాలు కళ్ల ముందు పురి విప్పుతుండగా ఆమె నడుము మీద చేయి వేస్తూ.

ఎర్రగా పండిన నాలుక చాపి వెక్కిరిస్తూ "అవును పాపం! ఇప్పుడు జాజులు, మల్లెలు మాత్రమే తక్కువ యీ మగాయనకు!" అల్లరిగా నా ముక్కు పట్టుకుని "ఇంకా..." అని ఆగిపోయింది. అది కేవలం అర్థోక్తో, వ్యంగోక్తో లేక శృంగారోక్తో క్షణంసేపు అర్థం కాలేదు. ఆ పైన "తాత్కాలికంగా కాలాన్ని ఆపేయగలిగాం కదా!" అన్నాను, సంతృప్తిగా ఆమె ముంగురులు సవరిస్తూ.

ముసిముసిగా నవ్వుతూ వసంత కేలండర్ మీద వున్న సుందరిని చూపించి, కళ్లలో యేవేవో భావాలు తడితడిగా కదలాడుతూండగా... "శరీరం కంటే మనసు ముందర రిటైర్ కాకూడదు, ఏ విషయానికైనా సరే!" నర్మగర్భంగా వసంతకేసి చూస్తూ "లేకుంటే శరీరం దొంగ దెబ్బ తీస్తుంది మనసు ఆదమరుపుగా వుంటే" అన్నాను వసంత పాదాన్ని అరచేతిలో పెట్టుకుంటూ.

"అవును మరి, రేపేపాటికి మనం రిటైర్ అవుతున్నాం కదూ? అది శారీరకమా లేక..." అంది నా గుండెపై వాలి... కుడి అరచేత్తో మున్నాలు చుడుతూ, వసంత ఆహ్లాదకరంగా చూస్తూ! ■